# శిక్షణలో ఉన్న క్రొత్త కాపరులకు మార్గదర్శక సూత్రాలు

**పౌలు – తిమోతి అధ్యయనాలను ఉపయోగిస్తూ సేవ ప్రారంభించడానికి శిక్షణలో ఉన్న కాపరులకు సహాయం**



**నేనీ అధ్యయనాలను ఎలా ఉపయోగించుకోవాలి?**

దయచేసి, పరిశుద్ధాత్ముని నడిపింపు కొరకు ముందుగా ప్రార్థించండి.

**1. ఒక ఉపదేశకున్ని అంటే మీ కన్నా ఎక్కువ అనుభవం గల ఒక నాయకున్ని క్రమంగా కలుసుకొండి.**

- యేసు మరియు అపొస్తలులు చేసినట్టుగా ఉపదేశకుడు కూడ నూతన నాయకులను తయారుచేస్తాడు. అంటే తరగతి గదిలో బోధించడం ద్వారా కాకుండా పనిచేస్తున్నప్పుడు మరియు ప్రయాణిస్తున్నప్పుడు తన వెంట ఉంచుకొని అవసరమైన విషయాలను నేర్పిస్తాడు.
- మీ ఉపదేశకుడు ఇతరులతో వ్యవహరిస్తున్న విధానాన్ని గమనించండి. మీరేం చేస్తున్నారో అతడు కూడా గమనిస్తాడు.
- కొన్ని వారాల పాటు మీరు చేపట్టవల్సిన కార్యక్రమాలను రూపొందించడానికి మరియు మీ సహవాసంలోని విశ్వాసుల అవసరాలకు తగిన అధ్యయనాలను ఎన్నుకోవడానికి, మీ ఉపదేశకుని సహాయం తీసుకోండి, దానివల్ల దేవుని పరిచర్యను మీరు క్రొత్త ప్రాంతాలకు తీసుకొని వెళ్ళగలుగుతారు.
- మీరు మరియు మీ సహవాసంలోని సభ్యులు ఏం చేస్తున్నారో అంటే ఏ కార్యక్రమాలను చేపడుతున్నారో మీ ఉపదేశకునికి ఎప్పటికప్పుడు తెలియజేయండి. మీ సమస్యలను మరియు వైఫల్యాలను ఉన్నదున్నట్టుగా ఎటువంటి దాపరికం లేకుండా తెలుపండి. మీ అపజయాలను గూర్చి చెప్పడానికి అవమానం అనిపించి, సత్యాన్ని మీరు దాచిపెడితే అతడు మీకేమీ సహాయం చేయలేడు.
- మీ సహవాసంలో ఇంకా ప్రారంభించబడని పరిచర్యలను మీ విశ్వాసులు ప్రారంభించడానికి సహాయపడే అధ్యయనాలను ఎన్నుకోండి.
- ప్రారంభంలో మీరు మీ శిక్షకున్ని వారానికి ఒకసారి గానీ లేదా రెండు సార్లుగానీ కలుసుకోవచ్చు. తర్వాత నెలలో ఒకటి లేదా రెండుసార్లు కలుసుకొంటే సరిపోతుంది. ఆ తర్వాత మూడు, నాలుగు నెలలకొకసారి చొప్పున మీకు సహాయం అవసరమైనంత కాలం కలుసుకోవచ్చు.
- మనం ఒకరినొకరం సరిదిద్దుకోవాలి (కొలస్సి 3:16) ఒకరితో ఒకరం తప్పులు ఒప్పుకోవాలి (యాకోబు 5:16) దీని అర్థమేమిటంటే మనం ఇతర నాయకుల సలహాలను స్వీకరించాలి వారు యదార్థంగాచేసే విమర్శలను, దిద్దుబాటును అంగీకరించాలి. చేసే సేవ దేవుని వాక్యానుసారంగా ఉన్నదో లేదో నిర్ధారించుకోవడానికి మనందరికీ హెచ్చరికలు సలహాలతో కూడిన ఇతర నాయకుల అజమాయిషీ అవసరం. ఈ రకమైన అజమాయిషీ లేదా నాయకత్వంలో ఉండడంవల్ల మనం నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొంటాం మరియు ఇతరుల మీద స్వార్థపూరితంగా, బాధకలిగించే విధంగా మనం అధికారం చెలాయించడం కూడా ఉండదు.
- ఒక నాయకుడు తాను చేసే పరిచర్యను ఎవరూ పరిశీలించకుండా చూసుకొని, ఎవరి సలహాలనూ పాటించకుండా ఉంటే అతడు ప్రమాదకరమైన మూర్ఖత్వం కలిగి ఉన్నాడని అర్థం. దీనివల్ల చాలా సంఘాలలో తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది.

**2. ఇతర నాయకులను కూడ క్రమంగా కలుసుకొండి :**

- మీ ప్రాంతంలోని ఇతర నాయకులను కూడా కలవండి. నాయకులంతా తమతమ సహవాసాలలో జరుగుతున్న పరిచర్యను వివరించాలి. విశ్వాసులు ఏ విధంగా పాల్గొంటున్నారో తెలుపాలి. మీ పరిచర్య వాక్యానుసారంగా ఉన్నదో లేదో వారు పరీక్షిస్తారు. మీరు వారి పరిచర్యను పరీక్షించండి.

- నాయకులు ఒకరి పరిచర్యనొకరు, ఒకరి ఆత్మీయ అభివృద్ధిని మరొకరు విశ్లేషించుకొని అంచనా వేసుకోవాలి. ఆత్మీయ స్థితిని మెరుగు పర్చుకోవడానికి ఒకరికొకరు సహాయపడాలి. ఒక్కరికొకరు సహాయపడడం అంటే ఏమిటో నూతన నిబంధన ఈ విధంగా నిర్వచిస్తుంది. "ఒకరినొకరు సరిదిద్దుకోవడం, ఒకరినొకరు క్షమించుకోవడం, ఒకరితో ఒకరు తమ తప్పులను ఒప్పుకోవడం ఒకరి బరువును మరొకరు భరించడం వంటి అనేకమైన ఒకరికొకరు ఆజ్ఞలను పాటించడం."
- ఒకరితో ఒకరు నమ్మకంగా ఉండండి. ఎవరైనా తప్పుచేస్తే ప్రేమతో సరిదిద్దండి. ఇతరులు మిమ్మల్ని సరిదిద్దడానికి అవకాశమివ్వండి, దిద్దుబాటును అంగీకరించండి. ఈ విధానంలో మనం ఎదిగి అభివృద్ధి చెందడానికి పరిశుద్ధాత్ముడు మనకు సహాయం చేస్తాడు.


**3. ఇతర నూతన నాయకులను తీర్చిదిద్దండి :**

- సాధ్యమైనంత త్వరగా మీరు క్రొత్త కాపరులకు శిక్షణనివ్వడం ప్రారంభించాలి. వారిలో కొందరు మీ పరిచర్యలో మీకు సహాయపడగలుగుతారు. మీతో సహ కాపరులుగాను, పరిచారకులుగాను, ఆరాధనను నడిపించే నాయకులుగానూ మీకు సహాయం చేస్తారు. మిగిలినవారు క్రొత్త సహవాసాలను ప్రారంభిచవచ్చు లేదా ఇతర సహవాసాలలో పరిచర్య చేయవచ్చు.
- వారేం చేస్తున్నారో వారి భవిష్యత్ ప్రణాళికలేమిటో అడిగి తెలుసుకొండి.
- వారి సహవాసంలోని విశ్వాసుల అవసరాలకు సరిపోయిన అధ్యయనాలను ఎన్నుకోవడానికి వారికి సహాయం చేయండి.
- వారికి మీ సహాయం అవసరమైనంత కాలం మీ సేవలందించండి. మీరు నూతన కాపరులను తయారుచేయాలని క్రొత్త నిబంధన తెలుపుతుంది 2 తిమోతి 2:2లో పౌలు తీతుకు చెప్పినట్టుగా కొందరు క్రొత్త కాపరుల పేర్లను మీరు ప్రతిపాదించాలి.
- తీతు 1:5–9లో వివరించిన లక్షణాలను క్రొత్త కాపరులు కలిగి ఉండాలి. వారు కాపరులుగా తమ బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించగలమని ముందుగా ఋజువు చేసుకోవాలి. దానికి ఒక మార్గమేమిటంటే తమ కుటుంబానికే కాపరిగా ఉండి వారిని సరియైన మార్గంలో నడిపించే బాధ్యత తీసుకోమని వారినడగాలి. ఒకవేళ వారు ఆ పని సరిగ్గా నిర్వర్తిగలిగితే సహవాసంలోనూ ఆ బాధ్యత నిర్వర్తించగలరని అనుకోవచ్చు.
- కొందరు క్రొత్త కాపరుల పేర్లను ప్రతిపాదించి, వారు తమ బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించగలరని మీకు నమ్మకం కలిగిన తర్వాత వారికి శిక్షణ నివ్వడం ప్రారంభించండి. క్రొత్తగా విశ్వాసంలోకి వచ్చిన వారికి నాయకత్వ బాధ్యతలను అప్పగించవద్దని 1 తిమోతి 3:1–7లోని వాక్య భాగం తెలియజేస్తుంది. కాని ఎంతకాలం ఆగాలో పౌలు కచ్చితంగా చెప్పలేదు. ఎందుకంటే కొంతమంది విశ్వాసులు మూడు వారాలలో పరిణితి చెందినంతగా మరికొందరు విశ్వాసులు 30 సంవత్సరాలలో కూడా పరిణితి చెందరు. గలతీయ సంఘంలో విశ్వాసంలోకి వచ్చిన కొన్ని వారాలకే కొంత మందిని పౌలు స్వయంగా క్రొత్త సంఘాలకు నాయకులుగా నియమించాడు. (అ॥కా॥ 14) అంతియొకయ వంటి పరిణితి చెందిన సంఘాలలో ఎక్కువ రోజులువేచి చూడవల్సిరావచ్చు. వారు పౌలు మరియు బర్నబాలపై చేతులుంచి ప్రార్ధించి సేవకు పంపించడానికి ఒక సంవత్సరం ఎదురుచూశారు. (అ॥కా॥ 11:25–26; 13:1–3)
- ఇతరులను నాయకులుగా తీర్చిదిద్దడానికి "నాయకులకు శిక్షణనిచ్చే వారికి మార్గదర్శక సూత్రాలు" అనే అధ్యయనం చదవండి.

**4. మీ విశ్వాసుల ప్రస్తుత అవసరాలను మరియు వారికి ఆసక్తి ఉన్న విషయాలను దృష్టిలో ఉంచుకొని తగిన అధ్యయనాలను ఎన్నుకొండి.**

మీ కో–ఆర్డినేటర్‌ను లేదా నాయకున్ని అడిగి పౌలు – తిమోతి విషయసూచికను తీసుకోండి దానిలో మీకు అవసరమైన పాఠాన్ని ఎన్నుకొని WWW.paul_Timothy.net నుండి దాన్ని డౌన్‌లోడ్ చేసుకొండి.

- విషయసూచిక లోనున్న అంశాల నుండి మీ సహవాసంలోని విశ్వాసులకు అవసరమైన అధ్యయనాలను ప్రార్థనా పూర్వకంగా ఎన్నుకొండి. మొదటి పాఠం నుండి ప్రారంభించి వరుసగా పాఠాలను బోధించనవసరంలేదు.
- మీ సంఘస్తులకు వారం వారం అవసరమైన పాఠాలేమిటో తెలుపమని దేవున్ని అడగండి. అప్పుడే పుట్టిన శిశువులకున్నట్టుగా క్రొత్తగా స్థాపించబడిన సంఘాలకు కూడ కొన్ని అవసరాలుంటాయి. మీరు అవి వెంటనే తీర్చాలి. అంటే వారికి అవసరమైన అంశాలను ఎప్పటికప్పుడు బోధిస్తుండాలి. అయితే ఏ రెండు సహవాసాలు కూడ ఒకే రకమైన పరిణితిని కలిగి ఉండవు. ఆ పరిణితిని సాధించే మార్గం కూడ ఒకే విధంగా ఉండకపోవచ్చు.



**జ్ఞానం గల కాపరులు తమ మందలోని గొఱ్ఱెల స్వరాన్ని "వినగల చెవులతో" జాగ్రత్తగా వింటారు.**

- వారి అవసరాలేమిటో వాటిని తీర్చడానికి గల అవకాశాలేమిటో తెలుసుకోవడానికి మీ విశ్వాసులు చెప్పే విషయాలను జాగ్రత్తగా వినండి.
- ప్రతి పరిచర్యకు లేదా అంశానికి సంబంధించి కొన్ని అధ్యయనాలున్నాయి. ఉదా : "ఆరాధన" అనే అంశం క్రింద, ప్రభురాత్రి భోజనం, యేసు పునరుత్థాన పండుగగా ఆచరించడం వంటి అంశాలతో పాటు ఆరాధనకు సంబంధించిన ఇతర అంశాలు కూడ ఉంటాయి.
- ప్రతి అధ్యయనం లేదా కూర్పులో ఒకే అంశంపై రెండు పాఠాలుంటాయి. ఒకటి కాపరుల కొరకు, మరొకటి పిల్లలకు దానివల్ల పెద్దలు అధ్యయనం చేయబోయే పాఠానికి సంబంధించిన బైబిల్ కథను నాటికగా ప్రదర్శించడానికి పిల్లలు ముందుగా సిద్ధపడగలుగుతారు. ఆరాధన సమయంలో పిల్లలు పెద్దల ముందు బైబిల్ కథను నాటికగా ప్రదర్శించవచ్చు.
- కాపరుల కొరకు ఉద్దేశించిన పాఠాల పైభాగమున కాపరుల అధ్యయనం అని ఉంటుంది. పాఠం యొక్క సంఖ్య "a"తో పూర్తవుతుంది.
- పిల్లల కొరకు ఉద్దేశించిన పాఠాల పైభాగమున "పిల్లల అధ్యయనం" అని ఉంటుంది. ఈ పాఠాల సంఖ్య "b"తో పూర్తవుతుంది.
- కొన్ని అధ్యయనాలలో "అదనపు అధ్యయనాలు కూడా చేర్చబడ్డాయి. వీటిలో ఆ అంశం గూర్చి అదనపు సమాచారం ఉంటుంది.
- ప్రతి క్రొత్త కాపరుల అధ్యయనంలో చాలా అభ్యాస కార్యక్రమాలు చేర్చబడ్డాయి అయితే వాటన్నింటినీ చేయవల్సిన అవసరంలేదు.

**5. బోధించడానికి ముందు లేదా ఏదైనా కారక్రమానికి నాయకత్వం వహించడానికి ముందు తగిన విధంగా సిద్ధపడండి.**

- ఏ కార్యక్రమం కొరకైనా కనీసం ఒక వారం ముందు నుండే సిద్ధపడడం అలవాటు చేసుకొండి. అలాగే మీ సహవాసంలోని వారు కూడా ఆ క్రమశిక్షణను పాటించేలా చూడండి.
- పిల్లలు ఆరాధన సమయంలో పెద్దల ముందు ప్రదర్శించడానికి ఏయే అంశాలలో సిద్ధపడ్డారో ఆయా అంశాలను ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయమని ఆరాధన నడిపించే నాయకున్ని కోరండి. అలాగే ఆ వారం అధ్యయనం చేస్తున్న అంశానికి సరిపోయే పాటలను మరియు ఇతర కార్యక్రమాలను ముందుగానే ఎంపిక చేసుకోమని కూడా చెప్పండి.
- మీ సహవాసం చిన్నదా? చాలా సార్లు కాపరులు ఆరాధనకు సిద్ధపడకుండా సాతాను శోధిస్తాడు. సహవాసం చిన్నదిగా ఉంటే ఆ అవకాశం మరింత ఎక్కువగా ఉటుంది. పెద్ద సహవాసాలలో కన్నా చిన్న సహవాసాలలో ఆరాధన నడిపించడానికి ముందుగా సిద్ధపడడం మరింత ప్రాముఖ్యమైన విషయమని అనడానికి నాలుగు కారణాలున్నాయి.

1. చిన్న సహవాసాలకున్న బలమేమిటంటే, క్రొత్త నిబంధన ఉపదేశించినట్టుగా ప్రతి ఒక్కరు ఆరాధనలో ఏదో ఒక విధంగా పాల్గొంటారు. ఎక్కువ మంది క్రీస్తు వద్దకు వచ్చి ఆయన పరిచర్యలో పాల్గొనడం చిన్న సహవాసంలోనే ఎక్కువగా జరగడం ప్రపంచమంతటా కనిపిస్తుంది. ఒకవేళ మనం ఆరాధన సమయానికి తగినంత ముందుగా సిద్ధపడకపోతే మరియు సహాయకులను సిద్ధపర్చకపోతే ఈ విధంగా అందరూ ఆరాధనలో పాల్గొనడమనేది జరగదు. నాయకుడే స్వయంగా అన్ని అంశాలనూ నిర్వర్తిస్తాడు. ఇది పరిశుద్ధాత్మున్ని దుఃఖపర్చే పాపం! మన సంరక్షణకు అప్పగించబడిన మంద యొక్క అభివృద్ధి దానివల్ల కుంటుపడుతుంది.
2. పెద్దపెద్ద సహవాసాలోని సభ్యులకు ఏ అవసరాలుంటాయో చిన్న సహవాసాలలోని సభ్యులకూ అవే అవసరాలుంటాయి. గనుక సహవాసం చిన్నదైనా లేక పెద్దదైనా కాపరులు ప్రార్థనా పూర్వకంగా సిద్ధపడడం అవసరం.
3. పెద్దపెద్ద సహవాసాలలో సాధారణంగా విద్యాధికులు మరియు అనుభవజ్ఞులైన కాపరులుంటారు. వారు పూర్తి సమయం సంఘ పరిచర్య చేస్తారు. ఆరాధనకు ముందు రోజే తగిన విధంగా సిద్ధపడడానికి అవసరమైన సామర్థ్యం మరియు సమయం వారికుంటుంది. అయితే చిన్న సహవాసాలు త్వరత్వరగా అభివృద్ధి చెందుతూ క్రొత్త సహవాసాలు ఏర్పడుతుంటాయి. గనుక సాధారణంగా పెద్దగా చదువుకోని అనుభవంలేని కాపరులు వారి సంరక్షణ బాధ్యతలను తీసుకొంటుంటారు. అటువంటి వారు ఆరాధనకు ముందు రోజు వరకూ సిద్ధపడకుండా ఉంటే వారి సిద్ధపాటు పేలవంగా ఉంటుంది దేవుని మందకు ఆయన ఆశీర్వాదాలు లభించకుండా వారు ఆటంకపర్చిన వారవుతారు.
4. ప్రార్థనా పూర్వకంగా సిద్ధపడుతూ సహాయకులను సిద్ధపర్చే సమయంలో పరిశుద్ధాత్ముడు శక్తివంతంగా పనిచేస్తాడు. కేవలం ఆరాధన సమయంలో మాత్రమే కాదు! ఈ సిద్ధపాటు సమయంలో క్రొత్త నాయకులను తయారు చేయడానికి దేవుడు అనేకులను వాడుకొంటాడు. యేసు ప్రభువు మరియు అపొస్తలుడైన పౌలు కూడా అలాగే చేశారు.

**6. మందను నడిపించడంలో ఇతరులతో కలిసి పనిచేయండి :**

- జ్ఞానంగల నాయకులు ఒంటరిగా పనిచేయరు. యేసు మరియు అపొస్తలులు ఒంటరిగా పనిచేయలేదు. ఆరాధనను నడిపించడానికి మరియు మందను కాపరిగా సంరక్షించడానికి ఇతర నాయకులను తయారు చేయండి. వారమంతా వివిధ వ్యక్తుల అవసరాలకు తగిన పరిచర్య చేయడానికి కొందరు పరిచారకులుగా కూడా పనిచేయాలి.
- ఎవరినైనా ఆరాధన నడిపించే నాయకులుగా మీరు సిద్ధపరుస్తున్నట్టయితే వారిని పౌలు–తిమోతి అధ్యయనాల నుండి "ఆరాధనను నడిపించే నాయకులకు మరియు వారి సమాయకులకు మార్గదర్శక సూత్రాలు – AOe" అనే పాఠం చదవమనండి.
- పిల్లలకు బోధించే ఉపాధ్యాయులకు ప్రతి వారం పిల్లల అధ్యయనం యొక్క కాపీని అందజేయండి.

**7. క్రొత్త కాపరుల అధ్యయనంలోని మూడు భాగాలను పాటించండి.**

- ఆ మూడు భాగాలు ఏవంటే :
  1. మీ మనస్సును మరియు హృదయాన్ని దేవుని వాక్యంతో సిద్ధపర్చుకొనుట.
  2. మీ సభ్యులు వారమంతా చేయవల్సిన పనుల ప్రణాళికను మీ తోటి పనివారితో కలిసి రూపొందించుట.
  3. మీ తోటి పనివారితో కలిసి ఆరాధన సమయం కొరకు కార్యక్రమాన్ని రూపొందించుకొనుట.
- మొదటి భాగం – మీ మనసును మరియు హృదయాన్ని దేవుని వాక్యంతో సిద్ధపర్చుకొనుట. మీరు ఒక అంశాన్ని గూర్చి ఆరాధన సమయంలో పంచుకోవాలను కొన్నప్పుడు, ఆ అంశంపై పౌలు–తిమోతి అధ్యయనాలలోని పాఠాలను ఒకటి రెండు వారాలు ముందుగానే అధ్యయనం చేయడం ప్రారంభించండి. దానిని పూర్తిగా అర్థంచేసుకోవడానికి కొంత సమయంపడుతుంది. దానిని గూర్చి ప్రార్థన చేయండి. మీ సహవాసంలోని సభ్యులు తమ జీవితాలకు

దానిని ఎలా అన్వయించుకోవాలో సూచించి వారికి సహాయపడండి. ఆ తర్వాత వారమంతా, వారు నేర్చుకొన్న సత్యానికి అనుబంధంగా వివిధ కార్యక్రమాలను చేపట్టేలా చూడండి.

- రెండవ భాగం – మీ సహవాసంలోని సభ్యులు వారమంతా చేయవల్సిన పనుల ప్రణాళికను మీ తోటి పనివారితో కలిసి రూపొందించండి. ఆరాధన కార్యక్రమానికి కొన్ని రోజులు ముందుగా మీ సహాయకులను కలుసుకొని ఆరాధన కార్యక్రమం జరిగిన తర్వాత ఆ వారమంతా మీ సభ్యులు ఏంచేయాలో వివరించే ప్రణాళికను తయారు చేసికొండి. ప్రతి అధ్యయనంలోనూ దీని విషయమై కొన్ని సూచనలున్నాయి. మీ సభ్యులు ఏంచేయాలని దేవుడు కోరుతున్నాడో మీకు ముందుగానే ఒక అవగాహన ఉంటే అర్థవంతమైన ఆరాధన కార్యక్రమాన్ని తయారుచేయడానికి మరియు అర్థవంతంగా బోధించడానికి మీకు వీలుకలుగుతుంది.
- మూడవ భాగం – రాబోయే ఆరాధన సమయం కొరకు మీ తోటి పనివారితో కలిసి ప్రణాళికను రూపొందించుకొనుట. మీరు బోధించడానికి మరియు ఆరాధనను నడిపించడానికి, మీ తోటి పనివారు మీకు సమాయపడాలి. ఆరాధన సమయానికి కొన్ని రోజుల ముందే కార్యక్రమాన్ని రూపొందించుకోవడం ద్వారా ప్రతి ఒక్కరు దాని కొరకు ప్రార్థించి తగిన విధంగా సిద్ధపడి పాల్గొనగలుతారు. కవితలను చదివే వారికి, నాటికను ప్రదర్శించే వారికి అభ్యాసం చేసుకోవడానికి తగినంత సమయం ఇవ్వండి. ఒకవేళ ఇదంతా వీలుకాకపోతే, ఆరాధనను నడిపించేవారు, వారి సహాయకులు ఆరాధన ప్రారంభించడానికి కనీసం ఒక గంట ముందు ప్రార్థించి, ప్రణాళికలను తయారుచేసుకోవడానికి కలుసుకోవాలి. విశ్వాసులందరూ స్వేచ్ఛగా పాల్గొనడానికి వీలు కలిగిస్తూ ప్రోత్సహించండి, దానివల్ల కొందరే పెత్తనం చలాయించే పద్ధతి ఉండదు.

**8. ఆరాధన కార్యక్రమాలలో పిల్లలు కూడ పాల్గొనేలా చూడండి.**

- పిల్లలు కూడ ఆరాధనలో పాల్గొనేటట్టుగా పిల్లలకు బోధించే అధ్యాపకులతో సంప్రదించి కార్యక్రమం తయారు చేయండి. పిల్లల అధ్యయనంలో పిల్లలు నాటికగా ప్రదర్శించడానికి అనువైన బైబిల్ కథలు మరియు ఆరాధన సమయంలో ప్రదర్శించగల ఇతర కార్యక్రమాలు చేర్చబడ్డాయి. సాధ్యమైనంత వరకు పెద్దలు మరియు పిల్లలు కలిసి పనిచేసేలా చూడండి.
- ఇంకా విశ్వాసంలోకి రాని పిల్లలు లేదా వారి తల్లిదండ్రులు లేదా ఆరాధనకు రాని కుటుంబాల వారిని నాటిక ప్రదర్శనలో సహాయపడమని కోరండి. వారికి నాటికలో ప్రాముఖ్యమైన పాత్రలను ఇవ్వనవసరంలేదు. కొన్ని సార్లు అటువంటి వారు క్రీస్తును అంగీకరిస్తారు.

**9. ఒకరికొరకు ఒకరు ప్రార్థించడానికి మరియు ఒకరికొకరు సలహాలనివ్వడానికి వీలుగా విశ్వాసులను చిన్నచిన్న గుంపులుగా విభజించండి.**

- మనందరం కలుసుకొన్నప్పుడు ఏయే పనులుచేయాలని దేవుడు కోరుతున్నాడో వాటిలో కొన్ని చేయాలంటే విశ్వాసులు చిన్నచిన్న గుంపులుగా కూడి ప్రతి ఒక్కరు చెప్పే దాన్ని శ్రద్ధగా వినగలిగే అవకాశం ఉండాలి.

  మనం ఒకరికొకరం వివిధ రకాలుగా సేవచేసుకోవాలని దేవుడు కోరుతున్నాడు.

  ఒకరినొకరు ఉపదేశించుకోవాలి : రోమా 5:14

  ఒకరికొకరు ప్రోత్సహించుకోవాలి : కొలస్సి 3:16; హెబ్రీ 10:25

  ఒకరినొకరు హెచ్చరించాలి : హెబ్రీ 3:13

  ప్రేమించడానికి మరియు మంచి పనులు చేయడానికి ఒకరినొకరు పురికొల్పుకోవాలి : హెబ్రీ 10:24

  ఒకరినొకరు బలపర్చుకోవాలి : 1 థెస్సలొనిక 4:18 మరియు 5:1, 11

  ఒకరితో ఒకరు వారి తప్పులను ఒప్పుకోవాలి : యాకోబు 5:16

  ఒకరికొరకు ఒకరు ప్రార్థించాలి : యాకోబు 5:16



**ఆరాధన సమయంలో చిన్నచిన్న గుంపులుగా చేరి సహాయం చేసుకొంటున్నప్పుడు పరిశుద్ధాత్ముడు ఎంతో శక్తివంతంగా పనిచేస్తాడు.**

**10. ఒక చిన్న గుంపుకు తగిన విధంగా బోధించండి మరియు ఆరాధించండి :**

- ఏదో ఒక విధంగా అందరూ ఆరాధనలో పాలుపుచ్చుకోవాలని అపొస్తలుడైన పౌలు 1 కొరింథీ 14:26లో కోరాడు. "మీరు కూడి వచ్చునప్పుడు ఒకడు ఒక కీర్తన పాడవలెనని యున్నాడు. మరియొకడు బోధింపవలెనని యున్నాడు; మరియొకడు తనకు బయలుపరచబడినది ప్రకటన చేయవలెనని యున్నాడు; మరియొకడు భాషతో మాటలాడవలెననియున్నాడు, మరియొకడు అర్థము చెప్పవలెనని యున్నాడు.
- చిన్న సహవాసాలలో వేదికలపై నుండిచేసే సంప్రదాయ ప్రసంగాలను జ్ఞానంగల కాపరి ఉపయోగించడు. కాని విశ్వాసులు ప్రశ్నలడగడానికి మరియు జవాబు చెప్పడానికి వీలుగా ఉండే పద్ధతిలో బోధిస్తాడు. వారు నేర్చుకొంటున్న దేవుని వాక్యంలోని సత్యాలను తమ జీవితాలకు ఎలా అన్వయించుకోవాలో చర్చిస్తాడు.
- పౌలు–తిమోతి అధ్యయనాలు చర్చల కొరకై ప్రశ్నలను, కవితలను కథలను, ఏకపాత్రాభినయాలను అందిస్తాయి. వాటిని ఉపయోగిస్తేమీ బోధ ఎంతో శక్తివంతంగా ఉంటుంది. కథలను గుర్తుపెట్టుకోవడం సులభం. అంతేకాదు దేవుని వాక్యాన్ని ఇతరులకు అందించడానికి అవి ఉపకరిస్తాయి.
- ఆరాధన సమయంలో కుర్చీలను వలయాకారంగా వేయండి దానివల్ల అందరూ ఒకరి ముఖాలనొకరు చూస్తూ ఒకరితో ఒకరు సులభంగా మాట్లాడుకోగలుగుతారు.
- పౌలు–తిమోతి అధ్యయనాలలో ఇవ్వబడిన అన్ని కార్యక్రమాలను ఉపయోగించడానికి ప్రయత్నించకండి. మీ సంఘ సభ్యుల ఆసక్తి, వారి సంస్కృతి సంప్రదాయాలకు తగిన వాటిని మాత్రమే ఎన్నుకొండి.

**11. ప్రభురాత్రి భోజనాన్ని క్రమం తప్పకుండా ఆచరించండి.**

- ప్రతి కాపరుల అధ్యయనంలో ప్రభురాత్రి భోజనం పరిచయం చేయడానికి ఒక ప్రత్యేకమైన వాక్యభాగం ఇవ్వబడింది.
- కొన్ని సంఘాలలో ప్రభురాత్రి భోజనానికి పరిచయంగా కేవలం 1 కొరింథీ 11 మాత్రమే ఉపయోగిస్తారు. ఈ వాక్యభాగాన్ని అప్పుడప్పుడు ఉపయోగించాలి. ఎందుకంటే ప్రభు సంస్కారాన్ని గూర్చిన ప్రాముఖ్యమైన మార్గదర్శక సూత్రాలు దానిలో ఉన్నాయి. అయితే ప్రతిసారి దానినే ఉపయోగించడంవల్ల యేసు చేసిన గొప్ప బలియాగాన్ని గూర్చిన ప్రశస్తమైన మరియు ఉత్తేజభరితమైన వాక్యభాగాలను చదవకుండా అవుతుంది.

**12. ఆరాధన సమయంలో, దేవుడు తమ జీవితాలలో చేసిన కార్యాలను మీ సంఘ సభ్యులు అందరితో పంచుకొనేలా చూడండి.**

- దేవుడు ఎవరినైనా స్వస్థపర్చాడా? చెడు అలవాట్లపై విశ్వాసులు విజయం సాధించారా? ప్రజలు క్రీస్తు వద్దకు వచ్చారా? క్రొత్త సహవాసాలు స్థాపించబడ్డాయా? క్రొత్త పరిచర్యలు ప్రారంభమయ్యాయా? దేవుడేమి చేస్తున్నాడో విశ్వాసులు చెప్పాలి మరియు వాటిని బట్టి దేవున్ని స్తుతించాలి.
- విశ్వాసులు చేస్తున్న సేవను గుర్తించడం ద్వారా వారు పరిచర్యను కొనసాగించేలా ప్రోత్సహించాలి. దానివల్ల ఇతరులు కూడ ప్రార్థించడానికి మరియు ఇంకా అధికంగా సేవ చేయడానికి ప్రోత్సహించబడతారు.

**13. ఆరాధన సమయం కొరకు మరియు వారమంతటి కొరకు కార్యక్రమాలను రూపొందించుకొండి.**

- మీ తోటిపనివారితో కలిసి మీరు వారమంతటికి మీ సభ్యుల కొరకు రూపొందించిన కార్యక్రమాలను ఆరాధన సమయంలో ప్రకటించండి.

- ఆ తర్వాతి వారంలో క్రీస్తును సేవించడానికి మరికొన్ని మార్గాలను విశ్వాసులు సూచించాలి.
- పరిచర్యలో పాల్గొనాలని ఇష్టపడే వారికి సహాయపడండి. దేవుడు వారికి ఏం చేయడానికి తగిన ఆత్మీయ వరాలనిచ్చాడో వాటిని చేయడానికి తోడ్పడండి.

  సువార్తనందించే వరం – ఇతరులకు యేసును గూర్చిన శుభవార్తనందించడం – లూకా 24:46–48

  సహాయపడే వరం – సహాయం అవసరమైన వారికి సహాయపడడం – గలతి 5:13

  కాపరిగా పనిచేసే వరం – దేవుని వాక్యాన్ని తమ జీవితాలకు అన్వయించుకోవడానికి తమ కుటుంబానికి సహాయపడగల సామర్థ్యం – ఎఫెసి 5:21–33; 6:1–4

  జ్ఞానవరం – దేవుని ప్రభావాన్ని సమాజంలోకి తీసుకొని రాగల సామర్థ్యం – మత్తయి 5:13–14

  కనికరపు వరం – అవసరతలో ఉన్న వారికి సేవచేయగలగడం – మత్తయి 25:31–46

  ప్రోత్సహించే వరం – ఇతరులను ఆదరించి వారిని సేదదీర్చడం – 1 థెస్సలొనిక 5:11

  స్వస్థపర్చే వరం – అనారోగ్యంగా ఉన్న వారి కొరకు, దయ్యం పట్టిన వారి కొరకు ప్రార్థించడం – యాకోబు 5:13–16

  నాయకత్వం వహించే వరం – ఇతర సంఘాలతో సహకరించడం – అ॥కా॥ 15:41

  ఇచ్చే వరం – అవసరమైన కార్యాలకు తగిన విధులు సమకూర్చగలగడం – 1 కొరింథి 8:1–4

**14. స్త్రీలకు మరియు పిల్లలకు పరిచర్యచేసే అవకాశం కల్పించండి.**

- దేవుడు తమకిచ్చిన ఆత్మీయ వరాలను స్త్రీలు ఉపయోగించాలి. కొన్ని సంస్కృతీ సంప్రదాయాలలో పురుషులు, స్త్రీలు తమకు బోధించడానికిగానీ శిక్షణ నివ్వడానికిడానికిగానీ అంగీకరించరు. మరికొన్ని సంస్కృతులలో ప్రిస్కిల్ల అపొల్లోకు శిక్షణ ఇచ్చినట్టుగా స్త్రీలు తమకు బోధించడానికి మరియు శిక్షణ నివ్వడానికి పురుషులు సుముఖంగా ఉంటారు. (అ॥కా॥ 18:26) అయితే ఏ సంస్కృతి సంప్రదాయాలకు చెందిన వారైనా స్త్రీలు యౌవనస్థురాండ్రకు శిక్షణనివ్వాలి, వారిని తీర్చిదిద్దాలి (తీతు 2:3–5)
- పెద్ద పిల్లలు చిన్న పిల్లలను శిష్యులుగా తీర్చిదిద్దడానికి అనమతించండి దానివల్ల ఇద్దరూ ఎదుగుతారు. అభివృద్ధి చెందుతారు.
- వారంలో వివిధ పరిచర్యలలో పాల్గొనడానికి కూడుకొనే మహిళలు మరియు పరిచారకురాండ్రు "పరిచారకులకు, పరిచారకురాండ్రకు, మరియు చిన్న సహవాసాల నాయకులకు మార్గదర్శక సూత్రాలు" AOd అనే పాఠం చదవాలి.

**15. కాపరుల అధ్యయనాలు చదివి అధ్యయనం చేయడం ముగించిన తర్వాత అదనపు అధ్యయనాలు చదవండి.**

- కాపరుల అధ్యయనాలు చిన్నవి మరియు సరళమైనవి. కాని భవిష్యత్తు కొరకు అవి బలమైన పునాదులను వేస్తాయి. ఒకవేళ మీరు వాటిని నిర్లక్ష్యంచేస్తే మీ పరిచర్యను బలహీనపర్చగల చీకటి తావులు మీ పరిచర్యలో ఉండవచ్చు.
- కాపరుల అధ్యయనంలో ఒక అంశం గూర్చి చెప్పబడిన దానికన్నా అధికంగా మీరు అధ్యయనం చేయాలనుకొంటే అదే అంశం మీద వ్రాయబడిన అదనపు అధ్యయనాలను కూడా చదవండి.

Copyright © 2004 by Paul-Timothy. May be freely copied. Download from www.Paul-Timothy.net